# గుజరాత్‌లో రూ.1800 కోట్ల విలువైన డ్రగ్స్ స్వాధీనం..

## అధికారులను చూసి సముద్రంలో పడేసిన స్మగ్లర్లు



విశ్వంభర, నేషనల్ బ్యూరో: మాదక ద్రవ్యాలను అక్రమంగా తరలించేందుకు స్మగ్లర్లు చేసిన ప్రయత్నాలను తీర గస్తీ అధికారులు భగ్నం చేశారు. ఈ క్రమంలోనే రూ.1800 కోట్ల విలువైన 300 కిలోల మెథాఫెంటమైన్ డ్రగ్స్‌ను గుజరాత్ యాంటీటెర్రరిజం స్క్వాడ్ , ఇండియన్ కోస్ట్ గార్డ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. డ్రగ్స్ స్మగ్లింగ్‌పై పక్కా సమాచారం మేరకు ఏటీఎస్, ఐసీజీ అధికారులు ఏప్రిల్ 12,13 రాత్రి సంయుక్తంగా ఆపరేషన్ చేపట్టాయి. ఈ క్రమంలోనే అంతర్జాతీయ సరిహద్దు సముద్ర రేఖ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న ఓ ఓడను గుర్తించారు. పడవను ఆపాలని అధికారులు వార్నింగ్ ఇవ్వడంతో వారి వద్ద ఉన్న మాదక ద్రవ్యాలను స్మగ్లర్లు సముద్రంలోకి విసిరేసి పారిపోయారు.అనంతరం కోస్ట్ గార్డ్ బృందం రెస్క్యూ బోట్ సహాయంతో వాటిని బయటకు తీసి సీజ్ చేసింది. స్వాధీనం చేసుకున్న మాదకద్రవ్యాలను విచారణ నిమిత్తం ఏటీఎస్‌కు అప్పగించారు. అయితే డ్రగ్స్ సరఫరా చేస్తున్న బోటుకు పాకిస్థాన్‌తో సంబంధం ఉన్నట్టు భావిస్తున్నారు. పాక్ నుంచే తీసుకొస్తున్నట్టు అనుమానిస్తున్నారు. ఈ చర్యపై కేంద్ర హోం మంత్రి అమిత్ షాస్పందించారు. భారీగా డ్రగ్స్ పట్టుకున్న ఏటీఎస్, ఐసీజీలకు అభినందనలు తెలిపారు. సముద్రంలో జరిగిన ఈ ఆపరేషన్ మాదకద్రవ్యాలను నిర్మూలించడానికి మోడీ ప్రభుత్వం చేపట్టిన ప్రయత్నాలను మరింత ముందుకు తీసుకెళ్తుందని నొక్కి చెప్పారు.

ఎన్‌సీఈఆర్‌టీ

## ఇంగ్లీష్ పుస్తకాలకు హిందీ పేర్లు..

### భాషా వివాదం వేళ కీలక పరిణామం




**విశ్వంభర, నేషనల్ బ్యూరో:** త్రి భాషా విధానంపై తమిళనాడు, కేంద్ర ప్రభుత్వం మధ్య వివాదం కొనసాగుతున్న నేపథ్యంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఎన్సీఈఆర్టీ కొత్తగా ముద్రించిన అనేక ఇంగ్లీష్ మీడియం పాఠ్య పుస్తకాలకు హిందీ పేర్లు పెట్టింది. రోమన్ లిపిలో హిందీ శీర్షికలను ఇచ్చింది. వాటిలో ఇంగ్లీష్ బోధించడానికి ఉద్దేశించిన పుస్తకాలు కూడా ఉన్నాయి. ఆరో తరగతి ఇంగ్లీష్ పుస్తకాన్ని గతంలో హనీసకిల్ అని పిలిచేవారు. ఇప్పుడు ఆ పుస్తకానికి పూర్వి అనే హిందీ పేరు పెట్టారు. ఈ పదానికి తూర్పు అని అర్థం. అలాగే 1, 2 తరగతుల ఇంగ్లీష్ టెక్స్ట్ బుక్స్‌కు మృదంగ్ అని మూడో తరగతి పాఠ్యపుస్తకాలకు సంతూర్ అని పేరు పెట్టారు. ఇవి రెండూ భారతీయ సంగీత వాయిద్యాల పేర్లు కావడం గమనార్హం. అయితే ఈ పేర్లు పెట్టడానికి గల కారణమేంటో అధికారులు క్లారిటీ ఇవ్వలేదు.దీంతో ఎన్సీఈఆర్టీ తీరుపై పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు. హిందీ మాట్లాడని రాష్ట్రాలపై హిందీని రుద్దడానికి ఇది ఒక రహస్య ప్రయత్నమని పలువురు ఆరోపిస్తున్నారు. హిందీ శీర్షికలను రోమన్ లిపి ఉపయోగించి వ్రాయడం వలన, వాటిని తప్పుగా ఉచ్చరించే అవకాశం ఉందని ఒక రిటైర్డ్ భాషావేత్త పేర్కొన్నారు. కాగా, నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ ప్రకారం ఎన్సీఈఆర్టీ 2023లో కొత్త టెక్స్ట్ బుక్స్‌ను ముద్రించడం ప్రారంభించింది. మొదట 1,2వ తరగతుల బుక్స్ రిలీజ్ కాగా, 2024లో మూడు, నాలుగు, ప్రస్తుత ఏడాదిలో 8వ తరగతి వరకు పుస్తకాలు వెలువడ్డాయి.

## తహవ్వుర్ రాణాను రోజుకు 8 గంటలకు పైగా ఎన్ఐఏ విచారణ




**ఢిల్లీ:** అమెరికా నుంచి తీసుకొచ్చిన 26/11 ముంబయి ఉగ్రదాడి కుట్రదారు తహవ్వుర్ రాణా ప్రస్తుతం జాతీయ దర్యాప్తు సంస్థ కస్టడీలో ఉన్నాడు. అతడిని రోజుకు 8 నుంచి 10 గంటల వరకు అధికారులు ప్రశ్నిస్తున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఉగ్రదాడుల కుట్రను పూర్తిస్థాయిలో ఛేదించేందుకు ప్రయత్నిస్తున్నట్లు మీడియా కథనాలు పేర్కొన్నాయి.తహవ్వుర్‌కు వైద్య పరీక్షలు చేయించారని.. అతడిని న్యాయవాది కలిసేందుకు అనుమతిస్తున్నట్లు ఎన్ఐఏ అధికారులను ఉటంకిస్తూ కథనం పేర్కొంది. ''జయా రాయ్ నేతృత్వంలోని ఎన్ఐఏ బృందం నిందితుడు తహవ్వుర్‌ను రోజుకు 8 గంటలకు పైగా విచారిస్తోంది. విచారణకు అతడు సహకరిస్తున్నాడు'' అని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. కాగా.. 2008 ముంబయి ఉగ్రదాడిలో ప్రధాన కుట్రదారుల్లో ఒకడైన తహవ్వుర్ రాణాను అమెరికా నుంచి భారత్ ప్రభుత్వం ఇటీవల దిల్లీకి రప్పించింది. ఎన్ఐఏ కోర్టు అతడిని 18 రోజుల కస్టడీకి అప్పగించింది. అతడిని అధికారులు ప్రశ్నిస్తున్నారు. ముంబయి దాడుల కేసులో మరిన్ని విషయాలు తెలుసుకోవడానికి దర్యాప్తును వేగవంతం చేశారు. ఆ దాడులకు పాల్పడిన ఇతర కుట్రదారులతో రాణాకు ఉన్న సంబంధాలపై ఆరా తీస్తున్నారు. అతడి వాయిస్ నమూనాను సేకరించడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ నమూనాల ద్వారా ముంబయి ఉగ్రదాడుల సమయంలో ఇతరులతో అతడు మాట్లాడినట్లు అనుమానిస్తున్న పలు కాల్ రికార్డ్‌లను ధ్రువీకరించే అవకాశం ఉంది.



డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 134వ జయంతి సందర్భంగా తుక్కుగూడ బస్టాండ్ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ కేఎల్ఆర్ అన్నారు. కార్యక్రమంలో ఆయన వెంట మహేశ్వరం కాంగ్రెస్ నేతల సహా నియోజకవర్గ మాజీ ప్రజాప్రతినిధులు, మహిళ, ఎస్సీ, ఎస్టీ, బీసీ విభాగాల ప్రతినిధులు ఉన్నారు.

- విశ్వంభర, మహేశ్వరం, తుక్కుగూడ




లయన్స్ క్లబ్ ఆఫ్ హైద్రబాద్ కాచం ఆధ్వర్యంలో డా. బీఆర్ అంబేద్కర్ 134వ జయంతి సందర్భంగా హైదరాబాద్ చైతన్యపురిలోని సాయినగర్ కాలనీలో అల్పాహారం వితరణ కార్యక్రమంలో ముఖ్యతిథిగా పాల్గొన్న సాయినగర్ కాలనీ గౌరవాధ్యక్షుడు రాంచంద్రరెడ్డి, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు లయన్ డా. కాచం సత్యనారాయణ, లయన్స్ క్లబ్ సభ్యులు లయన్ అరుణ్ అంబేద్కర్, లయన్ శ్రీధర్, లయన్ భరత్ రెడ్డి, లయన్ ముత్తి రాములు, లయన్ కాసం సాయి, లయన్ కార్తిక్, లయన్ విద్యాసాగర్, న్యాయవాది పరందాములు, కాంగ్రెస్ నాయకులు సురేందర్‌రెడ్డి, సాయినగర్ కాలనీ వాసులు లక్ష్మి, శోభ అరుణ్ తరితరులు.

- విశ్వంభర, చైతన్యపురి

## మోడీ ప్రభుత్వంలో అంబేడ్కర్‌పై గౌరవం మాటలకే పరిమితం: ఖర్గే



ఢిల్లీ: కేంద్రంలోని మోడీ సర్కార్, ఆర్ఎస్ఎస్‌లపై కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్ర ఆరోపణలు చేశారు. అంబేడ్కర్ ఆశయాలను నెరవేర్చే ఉద్దేశం నరేంద్రమోడీ ప్రభుత్వానికి లేదని విమర్శించారు. బీజేపీ ఆర్ఎస్ఎస్‌లు రాజ్యాంగ నిర్మాతకు శత్రువులని కీలక వ్యాఖ్యలు చేశారు. ''మోడీ ప్రభుత్వంలో రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌పై గౌరవం మాటలకే పరిమితం. ఆయన ఆశయాలను నెరవేర్చే ఉద్దేశం వారికి లేదు. ఆయన వారసత్వంపై పెదవి విరుస్తున్నారు. 1952 ఎన్నికల్లో అంబేడ్కర్ ఓటమికి ఎస్ ఏ డాంగే, వీడీ సావర్కర్‌లు కారణం. ఈ విషయాన్ని అంబేడ్కర్ ఓ లేఖలో పేర్కొన్నారు'' అని ఖర్గే వ్యాఖ్యానించారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా మీడియా సమావేశంలో పాల్గొన్న ఆయన ఎన్డీయే ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు.

**ప్రజలకు బహుమతి..**

దేశవ్యాప్తంగా కులగణన అవసరాన్ని ఖర్గే నొక్కి చెప్పారు. ప్రైవేటు విద్యా సంస్థల్లో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు రిజర్వేషన్లు అమలుచేయాలని అన్నారు. ''రాజ్యాంగం.. పౌరులకు అంబేడ్కర్ ఇచ్చిన బహుమతి. సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం పొందే హక్కును కల్పిస్తుంది. ఏఐసీసీ సమావేశంలో సామాజిక న్యాయానికి సంబంధించిన అభిప్రాయాలను ముందుకు తీసుకెళుతున్నాం. 2011 జనాభా లెక్కల ప్రకారం కేంద్రం విధానాలను రూపొందిస్తోంది. కానీ, 2021 జనాభా లెక్కల గురించి ఇంతవరకు జాడ లేదు. సాధారణ జనాభా లెక్కలతో పాటు ఏ విభాగంలో ఎంత పురోగతి సాధించామో తెలుసుకోవడానికి కులగణన ఉపయోగపడుతుంది. అందుకే కాంగ్రెస్ తన డిమాండ్ వినిపిస్తోంది'' అని అన్నారు.




రాజ్యంగ నిర్మాత డా. బీఆర్ అంబేద్కర్ 134వ జయంతి పురస్కరించుకొని హైదరాబాద్ చైతన్యపురిలోని సాయినగర్ కాలనీ శివాజీ సర్కిల్ వద్ద బొర్ర అరుణ్ అంబేద్కర్ ఆధ్వర్యంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ముఖ్యతిథి రోడ్డు రవాణాశాఖ కార్పొరేషన్ ఛైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, వీ3 న్యూస్ ఛానల్, విశ్వంభర దినపత్రి ఛైర్మన్ డా. కాచం సత్యనారాయణ, సాయినగర్ కాలని ప్రెసిడెంట్ లక్ష్మణాచారి, రాంచంద్రరెడ్డి, పరందాములు, కాంగ్రెస్ నాయకులు సురేందర్‌రెడ్డి, కొదుమూరి దయాకర్, వేణుగోపాల్, లక్ష్మి, నాగార్జన్ రెడ్డి, న్యాయవాది కేవీఎల్, శ్రీధర్, కార్తిక్, లయన్ రంగా, సాయినగర్ కాలనీ అసోషియోషన్ సభ్యులు తదితరులు.

- విశ్వంభర, చైతన్యపురి

## వక్ఫ్ చట్టం రాజ్యాంగ విరుద్ధం..

### సుప్రీంకోర్టులో పిటిషన్ వేసిన సీపీఐ



**విశ్వంభర, నేషనల్ బ్యూరో:** వక్ఫ్ సవరణ చట్టం 2025 రాజ్యాంగ చెల్లుబాటును సవాలు చేస్తూ భారత కమ్యూనిస్ట్ పార్టీ (Cpi) సుప్రీంకోర్టును ఆశ్రయించింది. పార్టీ ప్రధాన కార్యదర్శి డీ రాజా ఈ అంశంపై అత్యున్నత న్యాయస్థానంలో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. బిల్లును సమీక్షించడానికి ఏర్పాటు చేసిన జాయింట్ పార్లమెంటరీ కమిటీ సభ్యులు, ఇతర ప్రతినిధులు లేవనెత్తిన అభ్యంతరాలను కేంద్రం పరిగణనలోకి తీసుకోకుండానే కేంద్ర ప్రభుత్వం బిల్లును ఆమోదించి అమలు చేశారని ఆరోపించారు. వక్ఫ్ సవరణ చట్టం వక్ఫ్ బోర్డు స్వయం ప్రతిపత్తిని బలహీనపర్చడంతో పాటు, 1995 వక్ఫ్ చట్టం నిర్మాణాన్ని ప్రాథమికంగా మారుస్తుందని సీపీఐ తన పిటిషన్‌లో పేర్కొంది. అంతేగాక వక్ఫ్ బోర్డు పరిపాలనపై ప్రభుత్వానికి అపరిమిత అధికారం ఇస్తుందని, ఇది రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కుల్లో భాగమైన ఆర్టికల్ 25, 26, 29లో పొందు పర్చిన హక్కులను ఉల్లంఘిస్తుందని తెలిపింది. కాగా, వక్ఫ్ సవరణ చట్టం ఇటీవలే దేశ వ్యాప్తంగా అమలులోకి వచ్చిన విషయం తెలిసిందే. అయితే ఈ చట్టాన్ని వ్యతిరేకిస్తూ సుప్రీంకోర్టులో ఇప్పటి వరకు సుమారు 20కి పైగా పిటిషన్లు దాఖలయ్యాయి. వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్లపై సీజేఐ సంజీవ్ ఖన్నా, న్యాయమూర్తులు సంజయ్ కుమార్, కేవీ విశ్వనాథన్ లతో కూడిన ధర్మాసనం ఈ నెల 16న విచారించనుంది. మరికొన్ని పిటిషన్లను సుప్రీంకోర్టు రిజిస్ట్రీ ఇంకా ధర్మాసనం ఎదుట జాబితా చేయాల్సి ఉంది. ఈ విషయంలో ఏదైనా ఉత్తర్వులు జారీ చేసేముందు విచారణ చేపట్టాలని కేంద్రం సైతం అత్యున్నత న్యాయస్థానంలో కేవియట్ పిటిషన్ దాఖలు చేసింది. దీంతో సుప్రీంకోర్టు విచారణపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

## 'గోల్కొండ బ్లూ' వజ్రం వేలంపాటకు సన్నాహాలు

**ఇండోర్ :** ఒకప్పుడు భారతదేశ రాజుల దగ్గర ఉన్న అరుదైన వజ్రం 'గోల్కొండ బ్లూ' ను వేలం వేయడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. ఒకప్పుడు ఇండోర్, బరోడా మహారాజుల వద్ద ఉన్న విలువైన సంపదలో ఇదీ ఒకటి. 23.24 క్యారెట్ల విలువైన ఈ వజ్రాన్ని మే 14న జెనీవాలో జరిగే ''క్రిస్టీస్ మాగ్నిఫిసెంట్ జ్యువెల్స్'' సేల్‌లో వేలం వేయనున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. వేలంలో దీని ధర దాదాపు రూ.430 కోట్ల వరకు పలికే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. దాని రాజ వారసత్వం, అసాధారణ రంగు, పరిమాణంతో 'ది గోల్కొండ బ్లూ' ప్రపంచంలోని అరుదైన నీలి వజ్రాలలో ఒకటిగా నిలిచిందని క్రిస్టీస్ ఇంటర్నేషనల్ జ్యువెలరీ హెడ్ రాహుల్ కడాకియా ఓ ప్రకటనలో తెలిపారు. పూర్వం ఇండోర్‌ను పరిపాలించిన మహారాజా యశ్వంత్ రావు హోల్కర్ll వద్ద ఇది ఉండేది. 1923లో మహారాజా తండ్రి దీనిని ఓ బ్రాస్‌లెట్‌లో పొదిగించారు. అనంతరం ఆభరణాలను రీడిజైన్ చేయడంలో భాగంగా ఇండోర్ పియర్ వజ్రాలతో చేసిన నెక్లెస్‌లో 'ది గోల్కొండ బ్లూ'ను అమర్చారు. ఫ్రెంచ్ చిత్రకారుడు బెర్నార్డ్ బౌటెట్ డి మోన్వెల్ అప్పట్లో గీసిన ఇండోర్ మహారాణి చిత్రపటంలో ఆమె ధరించిన ఆభరణాలలో ఈ వజ్రం కూడా ఉన్నట్లు తెలుస్తోంది. 1947లో ఈ వజ్రాన్ని ప్రఖ్యాత న్యూయార్క్ ఆభరణాల వ్యాపారి హ్యారీ విన్స్టన్ కొనుగోలు చేశాడు. తర్వాత అది బరోడా మహారాజు వద్దకు చేరుకుంది. అనంతరం దీనిని ఓ ప్రైవేటు సంస్థ సొంతం చేసుకుంది.



## మహిళా సెలబ్రిటీల రోదసీ యాత్ర..

### వ్యోమనౌకలో బెజోస్ స్పెషల్ పర్సన్

**విశ్వంభర, నేషనల్ బ్యూరో :** రోదసీ పర్యటకాన్ని ప్రోత్సహించే దిశగా అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్‌కు చెందిన 'బ్లూ ఆరిజిన్'సంస్థ మరో ప్రయోగాన్ని విజయవంతంగా చేపట్టింది. ఇందులో భాగంగా బెజోస్ కాబోయే సతీమణి లారెన్ శాంచెజ్, అమెరికన్ గాయని కేటీ పెర్రీ, ప్రముఖ జర్నలిస్టు గేల్ కింగ్ తదితర ఆరుగురు మహిళలు అంతరిక్ష యాత్రను పూర్తి చేశారు. వ్యోమనౌకలో వీరంతా భూ ఉపరితలానికి దాదాపు 106 కిలోమీటర్ల ఎత్తుకు చేరుకుని.. కాసేపు భారరహిత స్థితిని ఆస్వాదించారు. 10 నిమిషాలపాటు కొనసాగిన ఈ యాత్రలో భాగమైనవారంతా మహిళలే కావడం విశేషం.లారెన్ శాంచెజ్, కేటీ పెర్రీ, గేల్ కింగ్, కెరియాన్ ఫ్లిన్, ఐషా బోవ్, అమందా గుయెన్‌లతో కూడిన 'న్యూ షెపర్డ్' వ్యోమనౌక పశ్చిమ టెక్సాస్ నుంచి నింగిలోకి దూసుకెళ్లింది. అనంతరం పారాషూట్ల సహాయంతో తిరిగి భూవాతావరణంలోకి ప్రవేశించింది. 2000లో ఏర్పాటైన 'బ్లూ ఆరిజిన్' సంస్థకు ఇది 11వ మానవసహిత యాత్ర. అమెరికాకు సంబంధించి పూర్తి మహిళలతో కూడిన తొలి రోదసీ యాత్ర ఇదే.

### దేశంలో అక్రమ నివాసం ఉంటున్న

## 15 మంది విదేశీయులను బహిష్కరించిన భారత్ !

**విశ్వంభర, నేషనల్ బ్యూరో:** దేశంలోని వివిధ రాష్ట్రాల్లో అక్రమంగా ఉంటున్న విదేశీ పౌరులు, చొరబాటుదారులపై నిరంతర చర్యలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలోనే వీసా వ్యాలిడిటీ ముగిసినప్పటికీ భారత్‌లో అక్రమంగా ఉంటున్న 15 మందిని ఢిల్లీ పోలీసులు అరెస్ట్ చేశారు. మోహన్ గార్డెన్, ఉత్తమ్ నగర్ ప్రాంతాల్లో నిర్వహించిన ఆపరేషన్‌లో ఇద్దరు బంగ్లాదేశీయులు , 12 మంది నైజీరియన్లు , ఐవరీ కోస్ట్ కు చెందిన ఒక పౌరుడిని అదుపులోకి తీసుకున్నారు. వీరంతా చెల్లుబాటు అయ్యే వీసాలు లేకుండా భారత్‌లో నివసిస్తున్నట్టు గుర్తించారు. అనంతరం వారిని నిర్బంధ కేంద్రానికి పంపించగా వారి ఐడెంటిటీని ధ్రువీకరించిన తర్వాత ఫారెనర్స్ రీజినల్ రిజిస్ట్రేషన్ ఆఫీస్ అధికారులు వారిని దేశం నుంచి బహిష్కరించాలని ఆదేశించినట్టు తెలుస్తోంది. అనంతరం వారిని స్వదేశాలకు పంపించినట్టు అధికారులు తెలిపారు. కాగా, ఢిల్లీలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కేంద్ర హోం మంత్రి అమిత్ షా (Amith shah) నేతృత్వంలో సమావేశం జరిగింది. ఈ భేటీలో భాగంగా బంగ్లాదేశ్ చొరబాటుదారులను గుర్తించి వారు దేశంలోకి ప్రవేశించడానికి సహాయం చేసే నెట్ వర్క్‌లను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ విషయాన్ని సీరియస్‌గా పరిగణించాలని తెలిపారు. దీంతో దేశంలో అక్రమంగా ఉంటున్న వారిని గుర్తించడానికి పోలీసులు నిరంతరం చర్యలు తీసుకుంటున్నారు.

### రూ.5-10 లక్షలకు

## పసిబిడ్డలను విక్రయిస్తున్న ముఠా అరెస్టు

**ఢిల్లీ:** నవజాత శిశువులను అపహరించి.. ధనవంతులకు రూ.510 లక్షలకు విక్రయిస్తున్న ఓ ముఠాను దిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో ఇద్దరు మహిళలు సహా ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. నిందితుల నుంచి నాలుగు రోజులున్న ఇద్దరు చిన్నారులను రక్షించినట్లు పేర్కొన్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుజరాత్, రాజస్థాన్, దిల్లీలోని పలు ప్రాంతాల్లోని ప్రభుత్వ ఆసుపత్రులే లక్ష్యంగా ఈ ముఠా కార్యకలాపాలు కొనసాగిస్తోంది. ఇప్పటివరకు దాదాపు 35 మంది చిన్నారులను విక్రయించింది. ఇటీవల ద్వారకా జిల్లాలోని ఉత్తమ్‌నగర్‌లో కొందరు వ్యక్తులు ఓ శిశువును విక్రయించడానికి ప్రయత్నిస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వారిని అదుపులోకి తీసుకోవడంతో ఈ ముఠా గుట్టు రట్టయ్యింది. అపహరించిన శిశువులను దిల్లీ చుట్టుపక్కల ఉన్న మురికివాడల్లో ఉంచి.. పిల్లలు లేని ధనవంతులకు వారిని రూ.5 నుంచి రూ.10 లక్షలకు విక్రయిస్తున్నారు. వారి నుంచి ఇద్దరు నవజాత శిశువులను కాపాడామని.. చిన్నారులు గుక్కపట్టి ఏడుస్తున్నా పట్టించుకోకుండా నిందితులు వారి విక్రయానికి ప్రయత్నించారని పోలీసులు తెలిపారు. మురికివాడల్లోనే కాకుండా దేశ రాజధానిలోని ధనవంతుల నివాస ప్రాంతాల్లో కూడా ఈ ముఠాకు విస్తృతమైన నెట్‌వర్క్ ఉందని ప్రాథమిక దర్యాప్తులో తేలింది. ఈ రాకెట్‌లో కొందరు వైద్యుల సహకారం కూడా ఉండొచ్చని అనుమానిస్తున్నారు. శిశువులను ఎవరెవరికి విక్రయించారనే విషయాన్ని తెలుసుకోవడానికి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## అమెరికాకు కీలక ఎగుమతులు నిలిపేసిన చైనా..!



**బీజింగ్ :** అమెరికాచైనా మధ్య వాణిజ్య యుద్ధం మరింత తీవ్రమైంది. అరుదైన ఖనిజాలు, కీలకమైన లోహాలు, అయస్కాంతాలను ఎగుమతి చేయడం బీజింగ్ నిలిపివేసింది. దీంతో పశ్చిమ దేశాల్లో ఆయుధాలు, ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్స్, ఏరోస్పేస్ తయారీ, సెమీకండక్టర్లు కంపెనీలకు సమస్యలు ఎదురుకానున్నాయి.

ఎగుమతులకు సంబంధించిన నిబంధనలను చైనా రూపొందిస్తోంది. అప్పటి వరకు చైనా పోర్టుల నుంచి మాగ్నెట్‌ల ఎగుమతులను నిలిపివేశారు. ఈ విషయాన్ని న్యూయార్క్ టైమ్స్ కథనంలో పేర్కొంది. ఈ నిబంధనలు అమల్లోకి వస్తే కొన్ని కంపెనీలకు శాశ్వతంగా వీటి సరఫరా నిలిచిపోనుంది.

### చైనా నుంచి దిగుమతులే కీలకం..

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మొదలు పెట్టిన వాణిజ్యయుద్ధానికి ప్రతి స్పందనగానే కీలక విడిభాగాల ఎగుమతులను చైనా ఆపేసింది. ప్రపంచ వ్యాప్తంగా ఉత్పత్తి అవుతున్న అరుదైన ఖనిజాల్లో దాదాపు 90శాతం చైనా నుంచే వెళుతున్నాయి. ఏప్రిల్ 2 నుంచి బీజింగ్ వీటి ఎగుమతులపై ఆంక్షలు విధించింది. అప్పటికే చైనా ఉత్పత్తులపై 54శాతం టారిఫ్‌లను ట్రంప్ విధించారు. వీటిని కాకుండా పర్మినెంట్ మాగ్నెట్ల, ఇతర ఉత్పత్తులను కూడా నిలిపేశారు. ఈ లోటును భర్తీ చేసుకోవడం అగ్రరాజ్యానికి ఇబ్బందికరంగా మారనుంది. అమెరికాతో వాణిజ్య ఉద్రిక్తతలు మరింత ముదిరితే ఇలాంటి చర్యలు చేపడతామని బీజింగ్ ఎప్పటి నుంచో హెచ్చరిస్తోంది.

### ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాలపై..

చైనా తాజాగా చేపట్టిన చర్యల ప్రభావం కేవలం అమెరికా వరకే పరిమితం కాదు.. అన్ని దేశాలపై ఉండనుంది. కీలక ఖనిజాల మైనింగ్, ప్రాసెసింగ్‌లో చైనా తనకున్న శక్తిని ఆయుధంగా వాడుతోంది. దీంతోపాటు ఎక్స్‌పోర్ట్ లైసెన్స్‌లను పరిమితం చేసే అవకాశాలు కూడా ఉన్నాయి. అమెరికాలోని లాక్‌హీడ్‌మార్టిన్, టెస్లా, యాపిల్ వంటి సంస్థలు చాలా ముడిపదార్థాల కోసం బీజింగ్‌పైనే ఆధారపడుతున్నాయి. అమెరికా ప్రభుత్వం వద్ద రేర్‌ఎర్త్ మినరల్స్ నిల్వలు ఇప్పటికే ఉన్నాయి. కానీ, తమ డిఫెన్స్ కాంట్రాక్టర్లకు సరఫరా చేయడానికి మాత్రం ఇవి సరిపోవు.